# ఫుట్‌పాత్‌లు నిరుపయోగం!

- నడిచేందుకు వీలులేక పాదచారులకు ఇబ్బందులు
- తాటిచెట్లపాలెం వీఐపీ రోడ్‌లో పరిస్థితి భయానకం





సాయిబాబా గుడి సమీపంలో ఫుట్‌పాత్‌పైకి విస్తరించిన చెట్లు



రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఫెన్సింగ్ లోనుంచి ఫుట్‌పాత్‌పైకి ఏపుగా పెరిగిపోయిన మొక్కలు

**తాటిచెట్లపాలెం :** తాటిచెట్లపాలెం నుంచి రైల్వే న్యూ కాలనీ ఎన్టీఆర్ జంక్షన్ వరకు ఫుట్‌పాత్‌ల మీద నడవాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల కనీసం నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి. ఇదంతా కేవలం సరైన నిర్వహణ లేకపోవడం వల్లేనని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తాటిచెట్లపాలెం నుంచి రైల్వే స్టేషన్ వరకు రహదారిని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌ను ఆధునీకీకరించి సుందరీకరించారు. దీంతోపాటు ఫుట్‌పాత్‌ల పక్కనే అందమైన మొక్కలు నాటి రక్షణగా ఫెన్సింగ్ కూడా వేశారు. అప్పట్లో వీటి నిర్వహణ సరిగానే ఉన్నా రానురాను అధికారులు పట్టించుకోవడం మానేశారు. దీంతో ఫుట్‌పాత్‌ల పక్కనే వేసిన మొక్కలు చాలా పెద్దవై ఫెన్సింగ్‌ను దాటి మరీ ఫుట్‌పాత్‌లు, రోడ్లపైకి వ్యాపించాయి. వీటి కారణంగా కొన్ని చోట్ల కనీసం ఫుట్‌పాత్ ఎక్కడుందో..?, అసలు ఉందో..? లేదో..? కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పిచ్చి మొక్కలు, పొదులు విస్తారంగా పెరిగిపోవడంతో ఫుట్‌పాత్‌లపై నడవాలంటే ప్రజలు భయపడుతున్నారు. పాములు, విషసర్పాలు, ప్రమాదకర కీటకాలు ఉంటాయేమోనని ఆందోళన చెందుతూ రోడ్డుపైనే నడుస్తున్నారు. అసలే రద్దీగా ఉండే రహదారి కావడంతోపాటు, ఎప్పుడూ వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో బిక్కుబిక్కుమంటూ పాదచారులు నడుస్తున్నారు. కొన్ని చెట్లు ఫెన్సింగ్ పైనుంచి ఏపుగా పెరిగి మొత్తం ఫుట్‌పాత్‌ను కనిపించకుండా చేసేశాయి. ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టి, ఏర్పాటు చేసిన మొక్కలను చక్కగా పెంచితే ఫుట్‌పాత్‌లు, పక్కనే ఉన్న గ్రీన్ బెల్ట్ సుందరంగా కనిపించేదని... అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఫుట్‌పాత్‌పై నడవలేకపోతున్నాం

వాకింగ్ కోసం రోజూ రైల్వే స్టేడియానికి ఇదే మార్గంలో వెళ్తున్నాం. ఉదయం వేళ ఫుట్‌పాత్‌లపై నడవాలంటే భయమేసి, రోడ్డు మీదనే నడుచుకుంటూ వెళ్తున్నాం. ఫుట్‌పాత్‌ల పక్కనే వేసిన మొక్కలు ఫుట్‌పాత్‌లపైకి వ్యాపించడం వల్ల వాటిపై నడవలేకపోతున్నాం.

– ఎస్.ఆదినారాయణ, తాటిచెట్లపాలెం

## నిర్వహణ లేకపోవడం వల్లే...

ఫుట్‌పాత్‌ల పక్కనే వేసిన మొక్కల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఇవి పెరిగి ఫుట్‌పాత్, ఫెన్సింగ్‌పైకి వ్యాపించాయి. వీటిని ఎప్పటికప్పుడు సరిచేయాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇలా రహదారులపైకి, ఫుట్‌పాత్‌లపైకి వ్యాపించాయి. దీనివల్ల స్థానికులు ఫుట్‌పాత్‌లపై నడవలేకపోతున్నారు. ప్రమాదమని తెలిసినా మెయిన్ రోడ్ పైనే నడవాల్సి వస్తోంది.

– ఆర్.మోహన్‌రావు, రైల్వే న్యూ కాలనీ

# రైతుబజార్లలో వంట నూనె విక్రయాలు ప్రారంభం



నూనె విక్రయాలు ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



రైతులతో మాట్లాడుతున్న మయూర్ అశోక్

**సీతమ్మధార :** వినియోగదారులకు వంట నూనె అందుబాటులో ఉంచినట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు గురువారం సీతమ్మధార రైతుబజారులో వంట నూనె స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో వంట నూనె ధరలు పెరిగిపోవడంతో వ్యాపారులతో చర్చించి తగ్గించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విశాఖపట్నంలోని 13 రైతుబజార్ల ద్వారా 'గోల్డ్ డ్రాప్' లీటర్ రూ.128, క్రిస్టల్ రూ.130, ఫ్రీడమ్ రూ.132కి విక్రయిస్తున్నట్లు తెలిపారు. నూనెలతో పాటు టమాటా కిలో రూ.50కే అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. బియ్యం, కందిపప్పు కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దసరా పండగ సందర్భంగా వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌వో భాస్కర్, ఇన్‌చార్జి ఏడీ రాకేష్, ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

**రైతుబజారు పరిసరాలు శుభ్రంగా ఉంచాలి**

రైతుబజారు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. బజారులోని రైతులతో ఆయన మాట్లాడి ధరల పట్టికలు పరిశీలించారు. అలాగే టమాటా విక్రయాల కౌంటర్ వద్దకు వెళ్లి వినియోగదారులుతో మాట్లాడారు. బజారు చివర దుర్వాసన రావడంతో తక్షణమే శుభ్రం చేయాలని ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబుకు సూచించారు. అనంతరం టమాటా విక్రయాల కౌంటర్ల వద్ద నోట్ బుక్‌లో నమోదు చేస్తున్న పేర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చుట్టు పక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# గాంధీనగర్‌లో భారీ అన్నసంతర్పణ



గాంధీనగర్‌లో అమ్మవారి సన్నిధిలో ఎంపీ శ్రీభరత్

**సీతమ్మధార :** జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెం గాంధీనగర్‌లో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బండారు గుప్తాజీ పర్యవేక్షణలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం భారీ అన్న సంతర్పణ చేశారు. ఎంపీ శ్రీభరత్ పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అప్పలరాజు, రాజేష్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రామి రెడ్డి, దుర్గా రెడ్డి, పవన్‌కుమార్, గణేష్, నూకేష్, శంకర్, చంటి, గణేష్ పాల్గొన్నారు.

**సీతంపేట :** శ్రీరాధాకృష్ణా రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో సీతంపేటలో నిర్వహిస్తున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మహా అన్నదానం నిర్వహించారు. సంపంగి శ్రీనివాసరావు, భీమవరపు శ్రీనివాసరావు, పోలంకి సత్యనారాయణ, సారిపిల్లి సంతోష్ పాల్గొని భక్తులకు వడ్డన చేశారు.

## క్లుప్తంగా

### రతన్‌టాటా లేని లోటు తీరనిది

**కంచరపాలెం :** కొందరు మహనీయులకు మరణం ఉండదని, రతన్ టాటా అమరునిగా నిలిచిపోతారని పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. రతన్ టాటా మరణానికి సూర్యారావు గురువారం సంతాపం తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టాటా కుటుంబం భారతదేశానికి చేస్తున్న సేవలు, వ్యాపార రంగంలో ప్రపంచంలో భారత్‌కు టాటా గ్రూప్ మూలంగా వస్తున్న పేరు ప్రఖ్యాతులు అభినందనీయమన్నారు. అప్పటి రాష్ట్రపతి ప్రతిభ పాటిల్ చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం రతన్ టాటా (పద్మ విభూషణ్)తో కలిసి అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆయనలేని లోటు తీరనిదని ఆవేదన వ్యక్తం చేశారు.

### లలితాపీఠంలో వ్యవస్థాపక పీఠాధిపతి జయంతి



పూజలందుకున్న వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి

**సీతంపేట :** లలితాపీఠం వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి మహరాజ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠం ఆవరణలోని దక్షిణామూర్తి మహరాజ్ విగ్రహానికి విశేష పూజలు, అర్చన చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాళీ, మన్యుపాశుపత హోమం నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణ, సామూహిక కుంకుమార్చన చేశారు. శుక్రవారం వనదుర్గా, శ్రీవిద్యా హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

### పల్నాటి కాలనీలో అభివృద్ధి పనులు



పల్నాటి కాలనీలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కవిత, ఇంజినీరింగ్ సిబ్బంది

**కంచరపాలెం :** జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి బర్మా క్యాంప్ పల్నాటి కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ గంకల కవిత గురువారం పరిశీలించారు. కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పాదర్శకత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను, సచివాలయ సిబ్బందికి ఆమె సూచించారు. సీసీ రోడ్ల నిర్మాణం, మెట్ల మార్గాలు, డ్రైనేజీ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

### 16.7 కేజీల గంజాయి స్వాధీనం

**తాటిచెట్లపాలెం :** విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... మహిళా ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ మహిళా ఎస్ఐ పీఆర్ బిశోయి సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన జగదీష్ నాయక్ విజయవాడకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని నుంచి 16.7 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించారు. జీఆర్పీ సిబ్బంది కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

# క్యాంపస్ డ్రైవ్‌లో 'గైస్' విద్యార్థుల సత్తా



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, ఇతర అధ్యాపకులు

**మురళీనగర్ :** కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో గైస్ విద్యార్థులు సత్తా చాటారు. ఇప్పటికే ఈ కాలేజీ నుంచి 150 మందికిపైగా ఉద్యోగాలు సాధించడంతోపాటు అత్యధికంగా పది లక్షల రూపాయల ప్యాకేజీతో ఒక విద్యార్థి ఉద్యోగం సాధించిన విషయం విదితమే. తాజాగా ఈ కాలేజీ నుంచి 10 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు అమ్మాయిలున్నారు. బి.విజయశ్రీ కార్తీక్, ఆళ్ల మౌనిక ప్రియ, జె.శ్రావణి శృతి, ఆదరి గణేష్, దొడ్డి జగదీశ్ చక్రి, బి.మోహన్ కుమార్, పి.లక్ష్మణ్ చరణ్, జి.బాలాజీ, ఎంవీ నరేష్ వర్మ, బి.షణ్ముఖరావు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి మొదటి సంవత్సరం రూ.2లక్షల వార్షిక ప్యాకేజీ ఇస్తారు. రెండో ఏడాది నుంచి రూ.3 లక్షల ప్యాకేజీ చెల్లిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి విద్యార్థులను అభినందించారు.

# ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు

**సీతంపేట :** స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రజల సంరక్షణ కోసం వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు అందజేస్తూ విశేష సేవలందిస్తున్నారని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.మీనాక్షిని అభినందించారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ అత్యాధునిక పద్ధతుల్లో ఉచితంగా కంటి పరీక్షలు, అవసరమైన చికిత్స అందిస్తున్నామని... అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ నవీన్ కుమార్, నేత్ర వైద్యశాల వైద్యులు, జూనియర్ వైద్యులు, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# జయహో దుర్గా భవానీ



ప్రత్యేక అలంకరణలో శాంతిస్వరూపిణి అమ్మవారు



దుర్గాదేవిగా లలితాంబికాదేవి



దుర్గాదేవి అలంకారంలో భూలోకమాత అమ్మవారు



హోమంలో వాడేందుకు సిద్ధం చేసిన పండ్లు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

**సీతమ్మధార :** జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల శ్రీ భూలోకమాత అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ ఇక్కడ అమ్మవారికి పంచామృతాభిషేకం, దివ్య అలంకారం, హోమం, కుంకుమపూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**సామూహిక కుంకుమ పూజలు**

రేసపువానిపాలెంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శాంతిస్వరూపిణి ఆలయంలో గురువారం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలదీపిక పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బి.గురునాథ్ రెడ్డి, సెక్రటరీ బాచీ, కర్రి మురళీకృష్ణా రెడ్డి, రెడ్డి బాబు, బర్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా చండీయాగం**

జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టిన్సన్‌లోని శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా చండీయాగం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 11 రకాల పండ్లతోపాటు డ్రై ఫ్రూట్స్, పట్టుచీరలు హోమంలో సమర్పించారు. ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు దుర్గా పరమేశ్వరిగా, వేంకటేశ్వర స్వామి బద్రీనారాయణుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉత్సవాలలో భాగంగా ఇక్కడి వేంకటేశ్వర స్వామి తిరుమల వేంకటేశ్వర స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రాజా స్వామి, సిబ్బంది శివ, వనజాక్షి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**మురళీనగర్ :** మురళీనగర్ రామాలయంలో లలితాంబికా దేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని గురువారం దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకుడు భోగాపురపు ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9 గంటలకు మహిళలతో సామూహిక సహస్ర నామ కుంకుమార్చన చేయించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణ రెడ్డి, సనపల వరప్రసాద్, కోశాధికారి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# వైభవుని సన్నిధిలో దసరా ఉత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న మహిళలు



పద్మావతి అమ్మవారికి రాగి తాపడం చేసిన ఆభరణాలు అందిస్తున్న మధుమోహన్ దంపతులు, నాగరాజు దంపతులు

**మురళీనగర్ :** కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా త్రిరాత్రి పూజా మహోత్సవాలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5 గంటలకు ఆలయంలోని పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో కలశ స్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సహస్ర కుంకుమార్చన అనంతరం తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని, వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం మహార్నవమి సందర్భంగా కలశం యందు సరస్వతి ఆరాధన, పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

**పద్మావతి అమ్మవారికి ఆభరణాల వితరణ**

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా స్వామి భక్తులు పద్మావతి అమ్మవారికి రాగి ఆభరణాలు అందించారు. విగ్రహ దాత మధుమోహన్ దంపతులు, నాగరాజు దంపతులు రాగితో తాపడం చేసిన కిరీటంతోపాటు ఇతర ఆభరణాలను ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా వీరిని ఆలయం తరఫున ఘనంగా సత్కరించారు.

# 'రన్ ఫర్ అంబేడ్కర్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, నిర్వాహకులు

**విశాఖ సిటీ:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న ఆర్కే బీచ్‌లో నిర్వహించనున్న రన్ ఫర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. రాజ్యాంగ గొప్పతనం, పౌరులకు సంక్రమించిన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ, ఇంత అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఆలుమ్నీ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఏయూ విద్యార్థి పరిశోధక బోధన, బోధనేతర సిబ్బంది, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, భీమ్‌సేన వారి భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో అందరూ భాగం కావాలని కోరారు. దీనికి రిజిస్ట్రేషన్ ఉచితమని, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ టీ షర్టు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు రన్ కొనసాగుతుందని, బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. 10 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.రాజు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఆలుమ్నీ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్, ప్రధాన కార్యదర్శి ఆరేటి మహేష్‌బాబు, స్టాటస్టిక్స్ విభాగం పూర్వ ఆచార్యుడు వివేకానందమూర్తి, డాక్టర్ బోరుగడ్డ మోహన్ బాబు, ఏయూ ఎస్సీ ఎస్టీ, బీసీ-సీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య టి.షారోన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.





## ఆకట్టుకున్న గార్బా నృత్యాలు



గార్బా నృత్య ప్రదర్శనలో మహిళలు

**మురళీనగర్ :** మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో నవరాత్రి వేడుకల్లో భాగంగా గార్బా నృత్య గాన కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన మార్వాడీ నృత్య రీతుల్లో ప్రముఖమైన గార్బా నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. మార్వాడీ మహిళలు పాల్గొని నృత్యాన్ని ప్రదర్శించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భవదీయం సభ్యులను పార్కు కార్యవర్గం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.